మాధవధార కేంద్రంగా జోన్-5 పాలన!

- విశాఖ ఉత్తర నియోజకవర్గంలో జోన్-5 కార్యాలయ నిర్మాణం
- రూ. 1.98 కోట్లతో పనులు
- త్వరలో జ్ఞానాపురం నుంచి మాధవధారకు మార్పు
- 24 వార్డులపై ఇక్కడి నుంచే పర్యవేక్షణ
- విశాఖ పశ్చిమ, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాలతో అనుసంధానం


జ్ఞానాపురంలో ప్రస్తుతం ఉన్న జోనల్ కార్యాలయం


జోనల్ కార్యాలయ భవన నమూనా

విశాఖ విద్య: నగరంలోని మూడు నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉన్న జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ – 5 జోనల్ కార్యాలయాన్ని త్వరలో మాధవధార వుడా లే అవుట్‌లోకి మార్చేందుకు చకాచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్ఏడీ – బిర్లా జంక్షన్ హైవేకు ఆనుకుని ఆర్టీఏ కార్యాలయం ఎదురుగా పంపు హౌస్ పక్కన ఉన్న విశాలమైన స్థలంలో అధునాతన భవనాల నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం తొలుత రూ.1.98 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం మొదటి అంతస్తు శ్లాబ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా జోనల్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారుల చాంబర్లతోపాటు, గ్రీవెన్స్ హాల్, సమావేశ మందిరం ఇలా సమస్త అవసరాలు తీరేలా భవనాన్ని డిజైన్ చేశారు. ప్రస్తుతం మంజూరైన నిధులతో పనులు కొనసాగిస్తున్నారు.

మరో రూ.2 కోట్లు అవసరం

ప్రస్తుత నిధులతోపాటు కార్యాలయం పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలంటే అదనంగా మరో రూ.2 కోట్లు అవసరం ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఆ మేరకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించారు.

వసతుల లేమి వల్లే మార్పు

ప్రస్తుతం జ్ఞానాపురంలో నిర్వహిస్తున్న కార్యాలయంలో సరైన వసతులు లేవు. జోనల్ స్థాయిలో సమావేశాల నిర్వహణకు సైతం సరైన సౌకర్యాలు లేవు. కార్యాలయానికి వెళ్లే ప్రజానీకం సైతం అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం మేరకు అధునాతన భవనం నిర్మించేందుకు నిధులు కేటాయించారు.

ప్రజానీకానికి చేరువలో..

జోన్-5 పరిధిలోకి వచ్చే 24 వార్డుల ప్రజానీకం జ్ఞానాపురంలోని కార్యాలయానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. మల్కాపురం ఏరియా వాసులకు దగ్గరగా ఉన్నప్పటికీ, అక్కయ్య పాలెం వరకు ఉన్న నార్త్ నియోజకవర్గ ప్రజానీకానికి జోనల్ కార్యాలయం దూరాభారమవుతోంది. భవిష్యత్‌లో నియోజకవర్గాల పునర్విభజన సైతం జరిగే అవకాశం ఉంది. ఈ మొత్తం పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఎన్ఏడీ సెంటర్‌కు సమీపంలో ఆర్టీఏ, ఎయిర్‌పోర్టు పోలీసు స్టేషన్ ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న మాధవధార వుడా లే అవుట్‌కు తరలించేలా నూతన భవనాలు నిర్మిస్తున్నారు.

వారికి దగ్గర.. వీరికి దూరం

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో పరిధిలోని 12 వార్డుల ప్రజలకు కొత్త జోనల్ కార్యాలయం అందుబాటులో ఉంటుంది. అయితే మల్కాపురం ప్రాంత వాసులు ఇక్కడికి రావడానికి కొంత దూరమవుతుంది. వీరంతా మింది మీదుగా ఎన్ఏడీ సెంటర్ నుంచి మాదవధార వుడా లే అవుట్‌లోని జోనల్ కార్యాలయానికి చేరుకోవాల్సి ఉంటుంది.

మూడు నియోజకవర్గాలతో అనుసంధానం

జ్ఞానాపురంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న జోన్-5 కార్యాలయం పరిధిలో 24 వార్డులు ఉన్నాయి. దక్షిణ నియోజకవర్గంలో రెండు వార్డులు, పశ్చిమ నియోజకవర్గంలో 10 వార్డులు, విశాఖ ఉత్తర నియోజకవర్గంలో అత్యధికంగా 12 వార్డులు ఉన్నాయి. మూడు నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉన్న జోనల్ కార్యాలయాన్ని పాలన పరంగా మల్కాపురం, జ్ఞానాపరం డివిజన్లుగా విభజించి ఆయా శాఖల అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.


మాధవధార వుడా లే అవుట్‌లో నిర్మిస్తున్న భవనం

సకాలంలో పూర్తి చేస్తాం

జోనల్ కార్యాలయ భవన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్మాణాల్లో నాణ్యతకు పెద్ద పీట వేస్తున్నాం. ఎప్పటికప్పుడు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నాం. సెల్లార్‌తోపాటు మూడు అంతస్తుల భవనం నిర్మాణం కోసం మరో రూ.2 కోట్లు అవసరం ఉంటుంది. దీనిపై ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారులకు నివేదించాం.

– భరణి కుమార్, డీఈ, జీవీఎంసీ జోన్ –5

క్లుప్తంగా

వేడుకగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవం


అమ్మవారిని దర్శించుకున్న శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ కొత్తరోడ్‌లో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవం కన్నుల పండువగా సాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ పెద్దలు వారిని శాలువతో సత్కరించారు. అమ్మవారి సన్నిధిలో సాయిభజనలు కోలాహలంగా నిర్వహించారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం పెద్దలు పాల్గొన్నారు.

కాలుష్య సమస్యపై అధికారుల ఆరా


సమస్య తెలుసుకుంటున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

మల్కాపురం: కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శుక్రవారం రాత్రి 58వ వార్డు ములగాడ గ్రామంలో పర్యటించారు. గ్రామానికి సమీపంలోని అలూఫ్లోరైడ్,కోరమాండల్ వంటి పరిశ్రమల నుంచి కాలుష్యం గ్రామంలోకి వస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.శీతకాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కాలుష్య నియంత్రణ అధికారి సునీల్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి కాలుష్య సమస్య ఎటువంటి ఇబ్బందులకు గురి చేస్తుందని విచారించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందించి గ్రామస్తులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో వార్షిక తనిఖీలు


సిబ్బంది పరేడ్‌ను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి శుక్రవారం నగర ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఏఆర్ మైదానంలో సిబ్బంది పరేడ్‌ను, టర్న్ ఔట్‌లతో పాటు డాగ్ స్క్వాడ్ పనితీరు, సిబ్బంది లాఠీ డ్రిల్, ఆయుధాల డ్రిల్, పీఈటీ బ్యాండ్, వెపన్ స్ట్రిప్పింగ్ అండ్ అసెంబ్లింగ్‌ను పరిశీలించారు. అత్యవసర సమయాల్లో గుంపులను చెదరగొట్టేందుకు వినియోగించే మల్టీ షెల్ లాంచర్, వజ్రా వాహనం ద్వారా వాడే మల్టీ బ్యారెల్ లాంచర్ ప్రయోగించే తీరును పర్యవేక్షించారు. ఏఆర్‌లో వినియోగిస్తున్న క్వార్టర్ మాస్టర్ సామగ్రిని పరిశీలించిన అనంతరం సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 తర్వాత నగర ఏఆర్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించడం లేదన్నారు. సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఏ సమస్య వచ్చినా 79950 95799కు సంప్రదించాలని సూచించారు. ఎటువంటి సలహాలు ఉన్నా తెలియజేయాలన్నారు.


డాగ్ స్క్వాడ్ పనితీరును పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు


డ్రైనేజీ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి మల్కాపురం పోలీస్‌స్టేషన్ సమీపంలో డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిర్మాణ పనులను శుక్రవారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నప్పుడు వర్షపు నీరు పోలీస్‌స్టేషన్ లోపలకు వేళ్లడమే కాకుండా స్టేషన్ బయట ప్రధాన రహదారి మీద కూడా నిలిచిపోయి వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించినట్టు చెప్పారు. ఫలితంగా జీవీఎంసీ నిధుల నుంచి సుమారు రూ.10 లక్షలు మంజూరు చేయడంతో డ్రైనేజీ నిర్మాణ పనులు చక చకా జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తులో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ శర్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీలను వినియోగించుకోవాలి

విశాఖ స్పోర్ట్స్: క్రీడాకారులు ప్రతిభతో రాణించి ప్రభుత్వం పెంచిన మూడు శాతం కోటాను సద్వినియోగపరుచుకోవాలని ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు అన్నారు. ఏయూ టెన్నిస్ జట్టు ఎంపికలో భాగంగా శుక్ర వారం నిర్వహించిన పోటీలకు ఆయన హాజరై ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు. సౌత్ జోన్ అంతర వర్సిటీల టెన్నిస్ పోటీలు కేరళలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరగనుండగా.. ఎంపిక చేసిన జట్టు పోటీ పడనుంది. కార్యక్రమంలో ఏయూపీఈ విభాగ సంచాలకుడు విజయ్‌మోహన్, పీడీ లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇసుక కోసం 11న మహాధర్నా


మహాధర్నా కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తగరపువలస: కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీ ఉత్తుత్తిదేనని తేలిపోయిందని, దీనిని నిరసిస్తూ ఈ నెల 11న జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగానున్న గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా చేయనున్నట్లు ఏఐటీయూసీ అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను కార్మికవాడలో భవన నిర్మాణ కార్మికులకు శుక్రవారం పంచుతూ ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అత్యంత దుర్మార్గమైన ఇసుక పాలసీని ప్రవేశపెట్టిందని మండిపడ్డారు. అందరికీ ఉచితమని ప్రకటించినా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 110 ఇసుక రీచ్‌లు ఉంటే 76 ర్యాంపులు మాత్రమే ఓపెన్ చేశారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో ఇసుక డెలివరీ చేస్తామని చెప్పి రోజులు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదన్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.7 వేలకు విక్రయించడం ప్రభుత్వ అక్రమ వ్యాపారమేనన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు ఇసుక తవ్వకాల అనుమతుల్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.ఈశ్వరరావు, కె.రాంబాబు, ఎం.అప్పలరాజు, సీహెచ్ రాంపైడి, గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఏఐ టెక్నాలజీపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సీఈవో ఇంతియాజ్

సీతమ్మధార: ప్రస్తుత డిజిటల్ పోటీ ప్రపంచంలో ఏఐ టెక్నాలజీపై అందరూ అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఆర్ మేనేజర్ కమాండర్ అర్జున్ రాధాకృష్ణ సూచించారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌ఆర్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ సీఈవో ఇంతియాజ్ అర్షద్ మాట్లాడుతూ హెచ్‌ఆర్ మేనేజర్లు తమకు ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తేనే రాణించగలరన్నారు. ఎల్పీజీ దక్షిణాసియా మాజీ సీఎఫ్‌వో గిరిధరన్‌మాట్లాడుతూ మానవ వనరులు అభివృద్ధిలో మేనేజర్లు కీలక పాత్ర వహిస్తారన్నారు. బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవ వనరుల అభివృద్ధిలో ఎనిమిదేళ్లుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కంపెనీల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల నైపుణ్య శిక్షణలు అందించి.. వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. అనంతరం నాగేశ్వరరావును సీఈవో ఇంతియాజ్ అర్షద్ ఘనంగా సత్కరించారు. వివిధ కంపెనీలు, హోటళ్లు, ఆస్పత్రుల హెచ్‌ఆర్ మేనేజర్లు, ఎస్‌డీఐ, బొల్లినేని సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


దేవతా మూర్తుల వేషధారణలో కళాకారులు


నృత్య ప్రదర్శనలో కళాకారులు

మల్కాపురం: కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక కళా వేదిక వద్ద ప్రముఖ కోలాట నృత్య కళాకారిణి ఆకుల లోవ రాజేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వేంకటేశ్వరస్వామి,అలివేలుమంగమ్మ, పద్మావతి ఇతర దేవతామూర్తుల వేషధారణలో నృత్య కళాకారులు శ్రీనివాసుడి కల్యాణం పేరిట ప్రదర్శన చేపట్టారు. అద్భుత ప్రదర్శనతో కళాకారులు వీక్షకులను మెప్పించారు.

పింఛన్‌దారులకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న ఏవీ రావు


హాజరైన విశ్రాంత ఉద్యోగులు

విశాఖ విద్య: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అర్హులైన రిటైర్డ్ ఉద్యోగులకు అధిక వేతనాలపై అధిక పెన్షన్ మంజూరు చేయాలని ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ ఏవీ రావు డిమాండ్ చేశారు. పింఛన్‌దారులతో మర్రిపాలెంలోని ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం రీజియన్స్ అసోసియేషన్ సభ్యులు, పెద్ద ఎత్తున పింఛన్‌దారులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవీ రావుతో పాటు, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగుల్లో కొంతమంది బకాయిలతో సహా అధిక పెన్షన్ పొందారని, ఎటువంటి కారణం లేకుండా అధిక వేతనాలపై పింఛను చెల్లింపు ప్రక్రియను నిలిపివేశారని గుర్తు చేశారు. పీఎఫ్ కార్యాలయ అధికారులు దీనిపై దృష్టి సారించి, హయ్యర్ పెన్షన్ అమలు చేసి, నిలిపివేసిన రైటర్డ్ ఉద్యోగులందరికీ చెల్లింపులు పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని పీఎఫ్ కార్యాలయ అధికారులకు అందించారు. ధర్నాలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ పైడిరాజు రెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వీవీకే రాయ్, అసోసియేషన్ నాయకులు ఎస్ఎస్ఆర్ శర్మ, కేపీఎన్ సింహం, ఎ.రాములు, బి.శ్రీరాములు, ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో ఛట్ పూజ సందడి


ఛట్ పూజలో పాల్గొన్న ఉత్తరాది ప్రజలు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో ఛట్ పూజ రెండో రోజు కూడా కొనసాగింది. గురువారం సాయంత్రం ప్రారంభమైన ఈ పూజా కార్యక్రమాలు శుక్రవారం ఉదయం కూడా కొనసాగాయి. తెల్లవారుజాము నుంచి ఉత్తరాది ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాండురంగాపురం డౌన్‌లోని బీచ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో పూజలు నిర్వహించారు. సాంప్రదాయ వస్త్ర ధారణలో పూజా సామగ్రితో ప్రత్యక్ష నారాయణుడైన సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలు చేస్తే ఆయురారోగ్యాలు, ఆనందైశ్వర్యాలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని ఉత్తర భారతదేశ భక్తుల నమ్మకం. సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాలలో సూర్యభగవానుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. నగరంలో నివసిస్తున్న ఉత్తరాది ప్రజలంతా పెద్ద సంఖ్యలో బీచ్‌లో చేరి, పూజలు చేయడంతో సందడి వాతావరణం నెలకొంది.

అపారిశుధ్యం.. దోమలకు ఆవాసం

- 62వ వార్డులో గాడి తప్పిన పారిశుధ్య నిర్వహణ
- పేరుకుపోయిన చెత్త కుప్పలు


62వ వార్డు ప్రకాష్‌నగర్ కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డులోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పింది. దీంతో ఎక్కడికక్క చెత్తకుప్పలు పేరుకుపోయాయి. కాలువలు పూడుకు పోయి దుర్వాసన వెదజల్లుతోంది. మరో వైపు దోమలు విజృంభించి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో పారిశుధ్యం లోపించడంతో వీధులన్నీ చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. కాలువల్లో వ్యర్థాలు తొలగించకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా పందులు సంచారం అధికమై వీధుల్లో తిరగాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోతుందని చెబుతున్నారు. రోడ్లు వ్యర్థాలతో నిండిపోవడంతో వాహనాలు జారి పడి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

పర్యవేక్షణ లేకే..


డ్రైనేజీలు సైతం పర్యవేక్షణ లేక పూడుకుపోయాయి. ఈ చెత్తలోనే ఆహార పదార్థాలతో కూడిన ప్లాస్టిక్ సంచులు కూడా ఉండడం, వాటిని తిన్న ఆవులు మృత్యువాత పడుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలు సైతం చెత్తను పీక్కుతింటూ రోడ్లపై చల్లడం వల్ల వీధుల్లో కాలు పెట్టలేని పరిస్థితి నెలకొందంటూ ప్రజలు వాపోతున్నారు. పరిస్థితి దారుణంగా ఉన్నా సంబంధిత అధికారులు ఇటువైపు రావడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

ఘనంగా శివాలయ శిఖర పూజ


పూజల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, కాలనీ పెద్దలు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్ ప్రాంతంలో శివాలయ శిఖరం ఏర్పాటు పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదటగా ఆలయ శిఖర స్థాపనకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి , లలితా దేవి, పార్వతీ పరమేశ్వరుల ఆలయాలు రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. త్వరితగతిన ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వుడా లే అవుట్ కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా కైలాసగిరి


మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ జేసీ రమేష్

విశాఖ సిటీ: విశాఖకే తలమానికమైన కైలాసగిరిని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు అందరూ సహకరించాలని వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కొమ్మి రమేష్ వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో కైలాసగిరిపై ఉన్న వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైలాసగిరిని సుందరంగా, శుభ్రంగా ఉంచేందుకు, పచ్చదనం పెంపొందించేందుకు అందరి సహకారం అవసరమన్నారు. వ్యాపారులు తమ వ్యక్తిగత వాహనాలను పార్కింగ్ ప్రాంతంలో మాత్రమే నిలపాలని సూచించారు. తద్వారా సందర్శకులకు ఇబ్బంది కలగకుండా ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను తమకు కేటాయించిన పరిధిలో మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకోవాలని, అద్దె బకాయిలను ప్రతి నెలా 5లోగా చెల్లించాలని చెప్పారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎఫ్‌వో శివాని, ఈఈ ఎస్.వి.ఎస్.ఎన్.రాజు, డీఈఈలు మోహనరావు, శంకరరావు, పరిపాలన అధికారి వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.